# ఇంత మాత్రం తెలీదూ?

'బంధువుల'

కృష్ణపక్షంలో ఒకనాటి సంధ్య. పది లేగల మధ్య పాలేరి పచ్చిక బయల్లో నున్నాడు.

ఒరే నాయనా ఊరెంత దూరముంటుంది? అన్నాడు వరరుచిముని దారిని పోతూ.

నీకెంత బుద్ధిలేదయ్యా.

ఎందుకు నాయనా ఊర్కే తిట్టిపోస్తావు.

ఇంత పెద్దాయన వామాత్రం తెలసికోలేక నన్నడుగుతా వెందుకు?

వరరుచికేమీ పాలుపోలేదు చూచేందుకు బాలుడు వయస్సు మహా ఉంటే ఎనిమిది. ఊరెంతలో ఉన్నదంటే తన్నొక బుద్ధిహీనుడి కింద కట్టేశాడు.

నాయనా తెలీకడుగుతా చెప్పవూ?

నీకీమాత్రం జ్ఞానం లేకపోగా దాన్ని పైపెచ్చు బయటపెట్టుకుంటా వెందుకు?

ఏమో నాయనా వయసుమళ్ళినవాణ్ణి. కాస్త చెప్పవూ.

నీకు కళ్ళు కనపడుతుందా? అయితే.

ఆ!

అయితే నన్ను చూడు. యీ లేగలను చూడు. ఆ ప్రొద్దు చూడు. ఇంకన్నా తెలిసికో!

వరరుచికి ఆవేదన మరింత ఎక్కువైంది. ఊరి దూరానికి వీటికి సంబంధం ఏమిటి? ఎంత యోచించినా తట్టలేదు. తనకు నిజంగా తెలివి లేదనుకున్నాడు. ఎంచేత తెలివి లేదో తెలిసికో వాలన్నది మరీ ఎక్కువైంది.

అబ్బాయి! నాకు నిజంగా తెలివి లేదు. అది ఎందుచేతనో కాస్త చెపుదూ.

అబ్బాయికి గర్వం ఎక్కువైంది.

తాతా నేను, యీ లేగలు ఆ వుండే ప్రొద్దులో ఇల్లు చేరాలంటే ఊరెంత దూరంలో ఉండాలి? ఆ చెట్లు దాటితే ఊరు.

బాలుని చూస్తే వరరుచికి అమిత సంతోష మైంది. ఇంత తెలివిగల బాలుడు దూడల మేపడ మెందుకు చదువుకోకుండా.

అబ్బాయి! నీవేమి చదువుతున్నావు.

మా నాన్న లేడు. మా అమ్మరు డబ్బులేదు. నాకు చదువులేదు.

౨

అమ్మా ఈ అబ్బాయి మీవాడేనా?

ఏం నాయనా? ఏమొచ్చింది? ఏ పాడువాళ్ళ నోటబడ్డాడు నా తండ్రి? అబ్బలేదని అందఱూ నా బిడ్డను అనేవాళ్ళే. వాళ్ళ మొహాలు మండా?

పెద్ద జల్లు వెలిసింది.

ఏమీ లేదమ్మా! మీవాడు చాలమంచివాడు. మహా తెలివిగలవాడు. వాడికి చదువులేకుండ వుంచారే అని అడుగుతా!

అయ్యో! నాయనా! నేనేమివ్వలేనే! నా తండ్రికి చదువు ఎవరు చెప్తారు.

అమ్మా నే చెప్పనా? నాకేమీ అక్కర్లేదు.

నా బిడ్డకే! నా తండ్రికీ! నాన్నకీ! చదువే! మీరు చెప్తారా? స్వామీ ఇచ్చేందుకు నావద్దేమీ లేదు. కొట్టకుండామాత్రం చూచుకోండి.

అబ్బాయిని పంపడమే పదివేలు. అంత తెలివిగలవాడు దెబ్బలెందుకు తింటాడు.

ఏమో నాయనా! నా తండ్రి నోక మొద్దు క్రిందకట్టి దూడల మేపుకోమన్నారే వూరివారంతా! మీ రొక్కరే వాడికి తెలివుందనడం.

౩

ఒరె నాగార్జునా !— పాణినికి అక్షరాలన్నీ నేర్పావా ?

మన్నించండి స్వామీ ! 'ఒ' నేర్చుకొని 'న' వ్రాశిస్తే వ్రాయనంటాడు.

అయ్యో వారంరోజులు వృథాపోయిందే !

అబ్బాయి ! పాణినీ, వ్రాయి నీకొచ్చింది.

'ఒ' వ్రాశాడు,

'న' వ్రాశిస్తా దిద్దునాయనా !

అదో అక్కడే నా సందేహం. తీరిస్తే తప్ప నే వ్రాసుకోను. అది ఎందుకు 'ఒ' అనాలి. ఇది ఎందుకు 'న' అనాలి. ఇది 'ఒ' అది 'న' ఎందుకు కాదు.

పెద్దవాళ్ళు అమాదిరి పేర్లుపెట్టారు నాయనా! మనం ఎందుకు పేర్లు మార్చకూడదు.

వరరుచికి ఇది చిక్కుప్రశ్నయింది.

అబ్బాయి ! అలా అనుకుంటే తప్పేమిలేదు. కాని పూర్వ గ్రందాల్లో ఆమాదిరి పేర్లుండేందు చేత అలా చదువుకొని పిమ్మట మనం మార్చుకోవచ్చు.

వాళ్ళనే నే చెప్పినట్లు మార్చుకోమనండి.

అది వీలుకాని పని నాయనా ! వాళ్ళలో చాల మంది చచ్చిపోయారు కాబట్టి.

అయితే సరే ! ఇది మొదటనే చెప్ప సందేహం తీరిస్తే నే కాదన్నానా ?

౪

ఆరు నెలలు ఆడిచింది.

స్వామీ యీ గ్రంథాలన్నీ శుద్ధ తప్పుల తడికలండి.

ఎంచేత నాయనా ?

స్వామీ శబ్దాలు ప్రయోగిస్తే ఒక తీరు న్యాయము ఉండాలి, పదాలు ప్రయోగించేందుకు వానికి కొన్ని నిబంధనలుండాలి. యీ గ్రంథాలలో అదేమీ లేదు. ఎవరికి తోచినట్లు వారు వ్రాస్తే అందరు గ్రహించడం సులభసాధ్యంగాదు.

సరే నాయనా ! కానీ, నీ విజ్ఞానాన్ని ఉపయోగించి భాషకు ఒక స్వరూపాన్ని కల్పించి సమగ్రవ్యాకరణాన్ని సృష్టించు. నీ పేరు సార్థకమవుతుంది.


